క్లుప్తంగా

అడిషనల్ ఎస్పీ పోలీసు స్టేషన్ల తనిఖీ



రాయవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ పాపారావు

రాయవరం: మండలంలోని 123 గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను తనిఖీని మండపేట నియోజకవర్గ పోలీస్ ఇన్‌చార్జ్, అడిషనల్ ఎస్పీ సీహెచ్‌పాపారావు శుక్రవారం చేపట్టారు. మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, ఎస్సై జి.నరేష్‌లతో కలిసి ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రాయవరం ఎస్సై నరేష్ మాట్లాడుతూ ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఎన్నికలను పురస్కరించుకుని గ్రామాల్లో 144వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎక్కడా నలుగురికి మించి గుమిగూడడం చేయరాదన్నారు. ఈ నెల 11 సాయంత్రం ఆరు గంటల నుంచి 14 ఉదయం ఆరు గంటల వరకు డ్రైడేగా ప్రకటించడం జరిగింది.

నూరు శాతం ఓటింగ్‌కు కృషి చేయాలి



కుయ్యేరులో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సూచనలిస్తున్న ప్రదీప్‌కుమార్

కాజులూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో నూరుశాతం ఓటింగ్ జరిగేలా నాయకులు, అధికారులు, ప్రజలు కృషి చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ ప్రదీప్‌కుమార్ ఐఏఎస్ అన్నారు. కుయ్యేరులో మోడల్ పోలింగ్ స్టేషన్‌గా తీర్చిదిద్దిన 156 పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆహ్లాదకర వాతావరణంలో ఓటింగ్ వేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన వసతులు, పోలింగ్ సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు శాంతిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వీర్వోలు ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, గోపాలరావు, సత్తిబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



సురక్ష కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని కాజులూరు సచివాలయం-2 పరిధిలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ దండంగి సరోజని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు తదితరులు పాల్గొని 410 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ గ్రామాల్లో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

మహిళాభివృద్ధికి జగన్ కృషి



చిన ద్వారపూడిలో ప్రచారం చేస్తున్న కుడుపూడి సత్య శైలజ భరత్

మండపేట: రాష్ట్రంలో మహిళాభివృద్ధికి పాటు పడుతున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ భరత్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం ఆమె మండలంలోని చిన ద్వారపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో మండపేట సొసైటీ చైర్మన్ పింకీ గంగాధరం, దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, చిన ద్వారపూడి గ్రామ పెద్దలు చెల్లుబోయిన నాగరాజు, దొమ్మేటి వీర్రాజు ,మేడిశెట్టి శ్రీనివాసరావు, గుత్తుల పట్టాభి సూరంపూడి నాగరాజు, కదలి శ్రీను, చెల్లుబోయిన దుర్గాప్రసాద్, సురంపూడి సత్తిబాబు, సూరంపూడి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనలో సుందర మండపేట

- తోడ్పాటు ఇచ్చిన ఎమ్మెల్సీ తోట
- గత ప్రభుత్వ పాలన కంటే అనేక రెట్లు అభివృద్ధి

కపిలేశ్వరపురం: మండపేట సామాజికంగానూ, రాజకీయంగానూ ఆర్థికంగానూ ప్రత్యేకత కలిగిన పట్టణం. దీర్ఘకాలంగా విస్మరణకు గురైన పట్టణం గత ఐదేళ్లలో విశేషంగా అభివృద్ధి చెందింది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన పాలనను సాగిస్తోంది. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పూర్తి సహకారంతో పట్టణంలోని పరిస్థితులు మెరుగుపడ్డాయి.

పేదల ముంగిటకు ప్రభుత్వ వైద్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 20వ వార్డులోని డాక్టర్ వైఎస్సార్ జగనన్న హౌసింగ్ కాలనీలో రూ.95 లక్షలతో మరో అర్బన్ పీహెచ్‌సీని నిర్మించింది. హరిజనపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను రూ.10 లక్షలతో ఆధునీకరించారు. ప్రధాన రహదారి సమీపంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ దశలో ఉంది. 345 మందికి రూ.62 లక్షల విలువైన వైద్య పరీక్షలు చేసి కళ్లజోళ్లు అందజేసింది. రూ.1.52 కోట్ల ఖర్చుతో 1,026 మందికి పోషకాహారాన్ని అందిస్తోంది.

పేదల చదువుకు ప్రాధాన్యత

పట్టణంలో ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 18 మున్సిపల్, ఒక జెడ్పీ, మొత్తం 20 పాఠశాలలు ఉన్నాయి. రూ.4.26 కోట్లతో నాడు –నేడు పథకంలో పాఠశాలలను మెరుగుపరుస్తున్నారు. ఇప్పటికే రూ.57.50 లక్షల విలువైన ఆరు పాఠశాలలను ఆధునీకరించారు. 2,154 మందికి రూ.1.53 కోట్లతో విద్యా కానుకలు అందజేశారు.



మండపేట మున్సిపల్ కార్యాలయం



ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్‌లో ఆన్‌లైన్ ఆధారంగా పాఠం వింటున్న విద్యార్థులు



సుందరంగా నిర్మితమైన పట్టణంలోని రహదారి

సంక్షేమంతో సామాన్యులకు ఆసరా...

జగనన్న తోడు పథకం పేరుతో పట్టణంలోని 9,428 మందికి రూ.9.42 కోట్లు విలువైన రుణాలను అందించింది. పట్టణంలోని 533 మంది రజకులు, దర్జీలు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరి ఖాతాకు రూ.10వేల చొప్పున ఐదేళ్లలో రూ.1.45 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేసింది. వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా సొంతంగా ఆటో కలిగిన కార్మికుడికి ఏడాదికి రూ.10 వేల చొప్పున పట్టణంలోని 164 మంది ఆటో కార్మికులకు ఐదేళ్లలో రూ.69 లక్షల ఆర్థిక సాయాన్ని పారదర్శకంగా వారి ఖాతాల్లోకి జమచేసింది.

రూ.44 లక్షలు విలువైన ట్యాబ్‌లను 329 మంది విద్యార్థులకు అందజేసింది. రూ.2.16 కోట్లతో 2,172 మంది లబ్ధిదారులకు జగనన్న గోరుముద్దపథకాన్ని అమలు చేస్తోంది.

అక్కచెల్లెమ్మలకు నివాసయోగ్యం....

ప్రస్తుత ప్రభుత్వం రూ.38.16 కోట్లను ఖర్చుచేసి వేములపల్లిలో 2,120 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చింది. ఏపీ టిడ్కో–పీఎంఏవై–జగన్న నగర్‌లలో రూ.4.82 కోట్ల విలువ చేసే 6,128 టిడ్కో ప్లాట్లు మంజూరయ్యాయి. మొత్తం ప్లాట్లు నిర్మాణం పూర్తయ్యింది.

మౌలిక సదుపాయాల కల్పన

రూ.1.20 కోట్లతో 4.75 కిలోమీటర్లు మేర తాగు నీరు సరఫరా సదుపాయాన్ని విస్తరింపజేశారు. పట్టణ ప్రజలు ఒక్కొక్కరికి రోజుకు 5.95 మిల్లీ లీటర్ల చొప్పున సరఫరా చేస్తోంది. టిడ్కో ప్లాట్ల వద్ద ప్రతీ బ్లాక్ మధ్యలో ఒక్కొక్కటి చొప్పున రూ.30 లక్షలతో 10 చేతి పంపులను ఏర్పాటు చేశారు. పట్టణంలో వినియోగంలో ఉన్న 2.5 ఎకరాల డంపింగ్ యార్డు సరిపోకపోవడంతో అదనంగా 2.75 ఎకరాల స్థలాన్ని సేకరించారు. రూ.2.65 ఓట్లతో 3.10 కిలోమీటర్లు మేర 54 డ్రైన్లు మంజూరు చేయగా రూ.2.05 కోట్లతో 2.52 కిలోమీటర్లు మేర 48 డ్రైనేజీల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.60 లక్షల విలువైన 0.58 కిలోమీటర్ల పొడవైన ఆరు డ్రైనేజీలు నిర్మాణంలో ఉన్నాయి. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ మున్సిపల్ పార్క్ నడక దారిని టైల్స్‌తో మెరుగుపరిచారు. పట్టణంలో 3,296 ఎల్ఈడీ బల్బులు సమకూర్చారు.

ఉద్యోగావకాశాలు

20,422 నివాసాలకు ఒక్కో సచివాలయం చొప్పున పట్టణంలో 14 వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటి ద్వారా 504 మంది పలు ప్రభుత్వ శాఖల ద్వారా ఉద్యోగావకాశాలు పొందారు. పట్టణంలో 322 మంది వార్డు వలంటీర్లుగా ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పించింది. నెలకు రూ.5వేల ఆర్థిక ప్రయోజనం కల్పించడంతో పాటు ఏటా వారికి సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన వారికి రూ.30 వేలు, సేవా రత్న పేరుతో రూ.20 వేలు, సేవామిత్ర పేరుతో రూ.10 వేల నగదు పురస్కారాలతో సత్కరిస్తోంది.

నాడు మోసగించి.. నేడు ఉపాధి అంట



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు



మండపేటలో బారీ బైక్ ర్యాలీ దృశ్యం

- యువతను మోసగించింది తెలుగుదేశం అధినేతే..
- చంద్రబాబు తీరుపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట ధ్వజం
- త్రిమూర్తులుకు మద్దతుగా యువత, పార్టీ శ్రేణులు భారీ ప్రచార ర్యాలీ

మండపేట: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని నిరుద్యోగులను, యువతను వంచించారని, తన 14 ఏళ్ల పాలనలో యువతకు 32 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు అన్నారు. తన విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం మండపేటలో యువత చేపట్టిన ఎన్నికల ప్రచార ర్యాలీలో తోట ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో యువతకు 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. తన హయాంలో యువతకు మొండి చేయి చూపిన చంద్రబాబు ఇప్పుడు గెలిపిస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. చంద్రబాబుకు పదవీ కాంక్ష ఎక్కువని, ఆయన పాలనంతా కల్లబొల్లి మాటలేనని త్రిమూర్తులు విమర్శించారు. యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పింది చేస్తారని ఒకే మాటపై ఉంటారన్నారు.

తోట విజయం కోరుతూ భారీ స్థాయిలో ర్యాలీ

తోట త్రిమూర్తులు విజయాన్ని కాంక్షిస్తూ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మండపేట పట్టణానికి తరలి వచ్చిన యువత, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. వందలాది మోటార్ సైకిళ్లతో వారంతా ర్యాలీలో పాల్గొన్నారు. విజయలక్ష్మినగర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీకి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజబాబు, నేమాని రాజశేఖర్ సారథ్యం వహించారు. ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా తొలుత రాజరత్న సెంటర్ చేరుకుంది. అక్కడి నుంచి 7, 8, 10, 11 వార్డుల్లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత కాలువ గట్టు, మారేడుబాక జంక్షన్ వద్ద సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలంతా తోట త్రిమూర్తులకు సాదర స్వాగతం పలికి, పూలమాలలతో ముంచెత్తారు. అనంతరం ర్యాలీ చెరువుగట్టు మీదుగా 12 ,13 వ వార్డుల్లో ప్రవేశించింది. 13వ వార్డులో శ్రీ విజయదుర్గ అమ్మవారి గుడి వద్ద అంజూరు శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో రోడ్డంతా పచ్చని తివాచీ పరిచి పూల వర్షం కురిపించారు. అనంతరం అక్షయ స్కూల్ మీదుగా గొల్లపుంత కాలనీ చేరుకుంది. ఈ కాలనీలోని సత్తెమ్మ తల్లిని తోట త్రిమూర్తులు దర్శించుకున్నారు. అనంతరం కృష్ణకళ్యాణి నగర్ 21వ వార్డు 22వ వార్డుకు చేరింది. అక్కడి నుంచి 25, 26, 27 వార్డుల మీదుగా కొనసాగిన ఊరేగింపు వీరభద్రపురం చేరింది. దారి పొడుగునా ప్రజలు తోట త్రిమూర్తులుకు స్వాగత నీరాజనాలు అర్పించారు. ప్రతి గడపగడపలో ఆయనకు స్వాగతం పలికారు. శుక్రవారం మండపేట అంతా పూల వర్షం కురిసింది. ఆయన రాకను స్వాగతిస్తూ వరుణుడు కూడా చిరుజల్లుతో స్వాగతం పలకడం విశేషం. దారి పొడుగునా యువత అంతా జై తోట, జై జగనంటూ నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు. పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటున ర్యాలీలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మహిళా కార్యకర్తలు, పార్టీ అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం.

ఫ్యాన్ గాలికి సైకిల్ బేజారు

- ప్రచారంలో హోరెత్తిన వైఎస్సార్ సీపీ
- వెనుకబడిన టీడీపీ
- నేటితో ముగియనున్న ఎన్నికల ప్రచారం



సూర్యప్రకాశ్‌కు మద్దతు పలుకుతున్న వివిధ సంఘాల నేతలు

రామచంద్రపురం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రచారం హోరెత్తింది. మూడు మండలాలు, రామచంద్రపురం అర్బన్ ప్రాంతాల్లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రచారం చేయటంతో ముందున్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ మండల గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. సూర్యప్రకాశ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన మూడు నెలల క్రితం నుంచి ప్రచారం ప్రారంభించి ప్రతి గ్రామంతో పాటుగా మున్సిపాలిటీ వార్డుల్లోనూ ఇంటింటికీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రచారం చేశారు. ప్రతి ఓటరును కలుసుకుని వైఎస్సార్ సీపీకి ఓటు వేయాల్సిన అవశ్యకతను వివరించారు.

కేడర్ సమన్వయంతో సక్సెస్

నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కేడర్‌లోని వివిధ వర్గాలకు చెందిన నాయకులను కేడర్‌ను సమన్వయం చేసుకోవటంతో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్ సక్సెస్ అయ్యారు. ఎంపీ సుభాష్‌చంద్ర బోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రెండు వర్గాలకు చెందిన కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ ప్రచారంలో దూసుకుపోయారు. సూర్యప్రకాశ్‌తో పాటుగా తండ్రి, ఎంపీ సుభాష్‌చంద్రబోస్ గ్రామాల్లోను పార్టీ నేతలు, గ్రామ పెద్దలను కలుస్తూ ముందుకు వెళ్లారు.

ఆత్మీయ సమావేశాలతో ఆకళింపు

ప్రచారం ఆద్యంతం అన్ని వర్గాలతోను కలిసి వెళ్లిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానికంగా ఉన్న తనను ఎన్నిక చేయడం ద్వారా కలిగే లాభాలను వివరించేందుకు పలు ఆత్మీయ సమావేశాలను నిర్వహించి వారికి వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం కూడా గత 25 ఏళ్లుగా తనకు తెలుసునని అన్ని వర్గాల అభివృద్ధి కోసం తాను బాటలు వేస్తానని చెప్పారు. అవినీతి లేని సమాజం, శాంతియుత నియోజకవర్గం కోసం తనకు ఓటు చేయాలని ఆత్మీయ సమావేశాల్లో ఆయా వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో చివరిగా ప్రధాన రహదారిలో భారీ ర్యాలీలో ప్రచారం చేశారు. ఈ ర్యాలీలో వివిధ వర్గాల వారు కుల సంఘాల వారు సూర్యప్రకాశ్‌కు ఘన స్వాగతం పలుకుతూ మద్దతు తెలిపారు.

ఇంటింటా ప్రచారంలో వెనుకబడిన టీడీపీ

ఎన్నికల నోటిఫికేషన్‌కు నెలన్నర రోజుల ముందు అమలాపురానికి చెందిన వాసంశెట్టి సుభాష్‌ను కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి ప్రకటించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేయటంలో టీడీపీ అభ్యర్థి బాగా వెనుకబడ్డారు. గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేయటం మినహా ప్రజలను నేరుగా కలవ లేకపోయారు. సుభాష్ నియోకవర్గానికి సంబంధించిన వ్యక్తి కాకపోవటంతో ఆయనను పరిచయం చేసుకునేందుకే సమయం సరిపోలేదు. దీంతో పట్టణంతో పాటుగా మిగిలిన గ్రామాల్లోను ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకోలేకపోయారు. దీంతో టీడీపీ ప్రచారంలో బాగా వెనుకబడి పోయింది. దీనికి తోడు కొత్త అభ్యర్థి కావటంతో అదే పార్టీకి చెందిన నేతలు కూడా ప్రచారంలో కనిపించకుండా పోయారు. అభ్యర్థి ప్రకటన వరకు ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్న రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ టిక్కెట్‌ను ఆశించిన సత్య స్కానింగ్ అధినేత కాదా వెంకటరమణలు అసలు ప్రచారంలో కనిపించకుండా పోయారు. అలాగే జనసేన నుంచి కూడా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన నేతలు కూడా టీడీపీ ప్రచారానికి దూరమయ్యారు. గ్రామాల్లో ప్రచార రథంతో ప్రచారం తప్ప నేరుగా ప్రజలను కలవటంలో టీడీపీ నేతలు విఫలమయ్యారు.

పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్



రామచంద్రపురం: ఈ నెల 13న పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణతో ఏర్పాట్లు చేపట్టామని అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. సుధాసాగర్ అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ కేంద్రమైన వీఎస్ఎం కళాశాల వద్ద సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలు, షామియానాతో కవర్ అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు ఈవీఎంలకు ప్రత్యేకంగా మూడంచెల భద్రత కల్పిస్తున్నామన్నారు. శాంతి భద్రతల విషయంలో నిర్వహణకు పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవడంతో పాటుగా 78 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వద్ద అదనపు కేంద్ర బలగాలతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్, భద్రతా సిబ్బంది నిర్వహణపైనా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ, ఎన్నికల పోలింగుకు సంబంధించి చివరగా చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక అమలు పోలింగ్ స్టేషన్లలో బారికేడ్లు, ఫర్నిచర్, లైటింగ్, తాగు నీరు తదితరాలతో పాటు వేసవి నేపథ్యంలో ప్రత్యేకంగా తాగునీటి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓటర్ల జాబితా కాపీ రూపకల్పన, మెటీరియల్ స్వీకరణ, పోలింగ్ సిబ్బంది. ఈవీఎంల తరలింపునకు రవాణా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలు మున్సిపాలిటీల పరిధిలో 137 ప్రాంతాల్లో మొత్తం 239 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. 78 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 106 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 24 మంది రూటు అధికారులు 24 మంది సెక్టార్ అధికారులు ఉన్నారని 239 పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్వోలు 239 మంది ఉంటారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల వ్యయ నిర్వహణ, పోలింగ్ రోజున పర్యవేక్షణ, ఈవీఎం ట్రబుల్ షూటింగ్ మెకానిజం తదితర అంశాల్లో అప్రమత్తంగా సిద్ధంగా ఉన్నామని ఆర్వో సుధాసాగర్ వివరించారు.

గ్రామాల్లో 'తోట' ఎన్నికల ప్రచారం

కపిలేశ్వరపురం: మండలంలోని నల్లూరు, టేకి, కోరుమిల్లి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలంటూ అభ్యర్థి తోట త్రిమూర్తులు ఓటర్లను అభ్యర్థించారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ లబ్ధిని అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచులు కురుపూడి ఉదయశ్రీ, కుక్కల నాగమణి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు పుట్టా కృష్ణమూర్తి, కుక్కల బాలయ్య, కురుపూడి శివశంకర్, వల్లూరి పెద్దబ్బు, సవిలే శరత్‌బాబు, కందుకూరి రమణ పాల్గొన్నారు.


ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కేంద్రానిదే..



టీవీ గోవిందరావు

మండపేట: లాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను పెద్ద భూచిలా చూపించి తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ ఎన్నికల్లో లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నాయని హైకోర్టు న్యాయవాది, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ స్టాండింగ్ కౌన్సిల్ టీవీ గోవిందరావు పేర్కొన్నారు. దీనిపై ఓటర్ల అవగాహనకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ వివాదాల పరిష్కారం కోసమే కేంద్ర ప్రభుత్వమే ఈ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకు రావాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే టైటిల్ రిజిస్టర్ అమలు చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని ఆయనన్నారు. తదనుగుణంగా అన్ని రాష్ట్రాల్లోనూ దశలవారీగా అమలు చేస్తున్నారని వివరించారు. ఈ చట్టం ద్వారా ఒకే రిజిస్టర్‌లో దేశంలోని అన్ని భూముల వివరాలు ఉండడం వల్ల ఏ భూమి ఎవరిదో తెలిసిపోతుందని చెప్పారు. దురాక్రమణలకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. దీనివల్ల ఎక్కడైనా పారదర్శకంగా ఎవరైనా, ఎక్కడైనా భూములను కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. ఒకే భూమిని అనేక సంస్థలు బ్యాంకుల దగ్గర ఒకటి కంటే ఎక్కువ సార్లు తనఖా పెట్టి రుణాలు తీసుకోవడం వంటి ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం ఇకపై ఉండదని గోవిందరావు స్పష్టం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అమలు చేయాలన్న ఆలోచన కేంద్రంలోని ప్రభుత్వాలకు 1989 నుంచే ఉందన్నారు.

మెర్నిపాడులో వైఎస్సార్ సీపీ ప్రచారం



ఎన్నికల ప్రచారంలో తోట త్రిమూర్తులు కుమార్తె కొట్టు శ్రీలక్ష్మి

మండపేట: మండలంలోని మెర్నిపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికలప్రచారం చేశారు. ఆ పంచాయతీ సర్పంచ్ గారపాటి సౌజన్య అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు కుమార్తె కొట్టు శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తన తండ్రి తోట త్రిమూర్తులును గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో గారపాటి మురళీకృష్ణ, బీసీ నాయకులు చిటికెన వీర్రాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లా వీరబాబు, తట్టవర్తి చంద్రావతి, ఉప సర్పంచ్ యనమదల సత్యవతి, పంపన పోలావతి, చల్లా వాణి ముత్యాల సత్యనారాయణ, వల్లూరి పట్టాభి రామయ్య, పిల్ల సూరిబాబులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ఆలమూరు: మండలంలోని మడికి శివారు నాగులపేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోంపా మాలిబాబు, కొండమ్మ దంపతులకు చెందిన పూరిగుడిసె నుంచి హఠాత్తుగా మంటలు వెలువడ్డాయి. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని మంటల అదుపు చేసేలోపే పూరిగుడిసె దగ్ధమైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

దళితులను గుండెల్లో పెట్టుకున్న నేత జగన్



ద్రాక్షారామ మండాలమ్మపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సూర్యప్రకాశ్

పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో దళితులను గుండెల్లో పెట్టుకున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని ద్రాక్షారామ మండాలమ్మపేట(ఎస్సీ కాలనీ)లో ఆయన శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ దేశంలోనే నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ అనగలిగే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ దళితులకు ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే తరువాత అంత ప్రాధాన్యం ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీలకే ఇచ్చిన ఘనత పార్టీకే దక్కుతుందన్నారు. అందుకే నియోజకవర్గంలోని దళితులంతా పార్టీని వెన్నంటే ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఎంపీటీసీలు నున్న సత్యవతి, ఇంత కనకదుర్గ, నాయకుడు కర్రి అబ్బు, కోటిపల్లి అబ్బు, మాజీ ఎంపీటీసీ యలమంచిలి రాజు, మాజీ సర్పంచ్ యలమంచిలి గంగాదేవి, ద్రాక్షారామ వార్డు సభ్యులు, మండాలమ్మపేట పెద్దలు పాల్గొన్నారు.

26న ఆదుర్రులో బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు

మామిడికుదురు: ఆదుర్రు ప్రాచీన ఆది బౌద్ధ స్తూపం వద్ద ఈ నెల 26న ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు ఏర్పాటు చేశామని ఆదర్రు బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి తెలిపారు. ఆదుర్రులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీరట్‌కు చెందిన పూజ్య భిక్షు డాక్టర్ నాగభూషణ కొండయ్య సారథ్యంలో జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పలువురు బౌద్ధ ధమ్మం స్వీకరిస్తారని చెప్పారు. సమావేశంలో మెండి ప్రతాప్‌కుమార్, భయ్యా మోహనరావు, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, పినిశెట్టి శేఖర్, కుడుపూడి సురేష్, పెదసింగు స్వామి, కొనుకు శ్రీనివాసరావు, కోటిపల్లి సాయిబాబు, పులపర్తి కృష్ణ పాల్గొన్నారు.